# భార వాహిక

"అసలు ఆ మడిసి ఎల్లిపొమ్మంటే నువ్వు ఎల్లిపోవడమేనా? ఆయన కిష్టలో దూకమంటే దూకేస్తావా?" అంటూ అతన్ని లోపలికి ఒక్క గుంజు గుంజి గట్టిగా అరుస్తోంది దుర్గ.

అప్పుడే ఒక స్నేహితుని ఇంట్లో జరిగిన సంగీత గోష్ఠిని ఆస్వాదించి ఆ 'యూఫోరియా'లో తలమునకలవుతూ గేటుముందు స్కూటర్ ఆపాను. నిలువెల్లా ఒణికి పోతున్నాడతను. గుర్తుపట్టాను. అతను రెండువారాలకిందట సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్ వెతుక్కుంటూ వచ్చినప్పుడు మా అపార్ట్‌మెంట్‌లో ఉండే సురేంద్రనాథ్ చటర్జీ ఉదయపు నడకకు వెళ్లి అప్పుడే వచ్చాడు. ఆయన కొంగ రెక్కల కన్న తెల్లని షార్ట్సూ, అంతే తెల్లని టీ షర్టూ వేసుకున్నాడు. నున్నటి పాలరాయి చప్టాలా వున్న తల ముందు భాగమూ, మెడలో ధరించిన బంగారపు తాపడం చేసిన రుద్రాక్షమాలా ప్రకాశిస్తున్న ఇండియాకి సంకేతంలా వుండగా, బట్టతల చుట్టూ వలయాకారంగా వున్న తుమ్మెద రెక్కలవంటి జుట్టు ప్రకాశించని ఇండియా దాని చుట్టూనే వుందని కూడా గుర్తు చేస్తూ ఉంటుంది. ఎప్పుడూ నవ్వుతూ వుండే ఆయన పళ్లు ముత్యాల్లా వుంటాయి. ఇటీవలే గురువారెడ్డిగారు వేసిన మోకాలి చిప్పలతో కరెంటు లేనప్పుడు చకచకా మెట్లెక్కుతాడాయన. తనకున్న అనేకానేక ఇళ్లలో ఒకటైన ఈ పెద్ద ఇంటిని పది అపార్ట్‌మెంట్లు కట్టి అందులో అయిదు తన బంధువులకి అమ్మి, మిగతా అయిదింటిని తానుంచుకుని, అందులో రెండింటిని కలిపి డ్యూప్లెక్స్ కింద చేసుకుని ఆరు బెడ్ రూములూ, పన్నెండు బాల్కనీలతో అక్కడే స్థిరపడి అపార్ట్మెంట్ అసోసియేషన్‌కి స్వయం ప్రకటిత కార్యదర్శిగా వుంటున్నాడు. కాంపౌండులోని మామిడిచెట్లు ఒకప్పుడు తనవి కనుక ఇప్పుడూ తనవేనంటాడు. ఇల్లు తనదీ, చెట్లు తనవీ కనుక వాచ్‌మన్

కూడా తన స్వంత నౌకర్లా వుండాలనుకుంటే తప్పేమంటాడు. అదే నచ్చదు దుర్గకి. ఇంతకీ అంత పెద్దమనిషి నచ్చని దుర్గ ఎవరంటే...

పది చేతులూ, పది కాళ్ళూ, పది నోళ్ళూ, వెయ్యి కళ్ళూ వున్న ఒక ఆడమనిషి. ఆ పొద్దుట ఒక చేత్తో కొబ్బరిపుల్లల చీపిరి పట్టుకుని సెవెన్‌హిల్స్ అపార్ట్‌మెంట్ గేటుముందు ఊడుస్తూ - మరొక చేత్తో ఎడతెరిపిలేకుండా మోగుతున్న ఇంటర్కాం తీస్తూ - ఇంకొక చేత్తో తన గదిలో పొయ్యి మీదేసిన బియ్యపురవ్వ ఉప్మా కలియబెడుతూ, మరొక చేత్తో నిద్రపోతున్న మొగుడి వీపు మీద రెండు దెబ్బలేసి లేపుతూ ఒక నోటితో "తొందరగా పళ్ళుతోమి సావు" అని కూతుర్నీ, మరొక నోటితో "సైకిలేసుకుపోయి రెండు పాల పేకట్లంట తెచ్చి అయిదో ఫ్లోర్‌లో ఆవిడ మొహాన కొట్టు" అని కొడుకునీ గదుముతోంది. అప్పుడే సందు మొదట్లో చటర్జీ బాబుగారి కారు హారన్ గట్టిగా మోగడంతో మరో రెండు చేతుల్తో గేటు బార్లా తెరిచి ఆయన కారులో ఊరవతల తోటలోకి వాకింగ్‌కి వెళ్ళి తెచ్చిన తోటకూర కట్టో, కాలీఫ్లవరుపువ్వో అందుకోడానికి సిద్ధపడిపోయింది... అదుగో అప్పుడే వచ్చాడు ఈ మనిషి.

నేనూ అప్పుడే నా కూతురు చెప్పకుండా స్కూటర్ తాళం చెవులు ఎత్తుకుపోయి చక్కర్లు కొడుతుంటే తనని పట్టుకుని ఒక మొట్టికాయ వేసి వెనక ఎక్కించుకుని మెచ్చుకుంటే అలుసైపోతానని, కోప్పడ్డట్టు నటిస్తూ వస్తున్నాను. ఆ సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చి పోస్ట్ చూసుకోడం కోసం ఆగినప్పుడు అతనెవరని అడిగితే దుర్గ చెప్పిన కథ నా మాటల్లో-

ఎండకి ఎండి, వానకి తడిసి, చలికి వణికి, మాడి ఇంట్లో మిగిలిన ఒకటీ, అరా బొచ్చెలు చిత్తుకాగితాల్లెక్కన అమ్మి కూతురింటికి హైదరాబాదెళ్ళి, అక్కడినించి విజయవాడ రైలెక్కి తెల్లవారుఝామునే దిగినా, కొడుకిచ్చిన మొగల్రాజపురం చిరునామా వెతుక్కుంటూ వచ్చేసరికి ప్రాణం పోయినంత పనయింది ఈ మనిషికి.

"ఏయ్ ఎవర్నువ్వు? పో బయటికి. అడుక్కునే వాళ్లంతా లోపలికొస్తారు. ఏడీ పానకాలు? పొద్దున్నే ఎక్కడికి పోయాడు?" అని ఈ మనిషిని చీదరించుకున్నారు కొత్తగా కొన్న స్కోడా కారు దిగిన చటర్జీగారు.

"ఈన మా మావయ్యలెండి సార్. ఇప్పుడే వూర్నించొచ్చాడు" అని "నువ్వు లోపలికి పద మావయ్యా" అంది దుర్గ. ఆయన మొహం చిట్లించుకుంటూనే, లిఫ్టెక్కి తలుపులు సరిగ్గా వేసుకుని వెళ్ళిపోయాడు.

"ఎవరదీ?" అన్నాడు లోపల్నుంచి పానకాలు.

"మీ నాన్న..." అని మళ్లీ నోటికి పని చెప్పింది. దీనికి వాళ్ళమ్మ దుర్గ అని

పేరెట్టింది గాని కాళికామ్మవారే ఇది. ఇదా నన్నుండనిచ్చేదిక్కడ? అనుకున్నాడు వచ్చిన మనిషి.

"తొందరగా తెమిలి బడికి పోయి సావు..." అని కూతురుని కోప్పడింది. "ఇహనైనా లెగిసి బైటికొస్తావా లేదా?" అని మొగుణ్ణి కేకలేసింది. మొదటినించీ దీనికి పెద్దనోరే. "కూతురుకి వున్నదంతా ఇచ్చి మా చేతికి చిప్ప ఇచ్చావు గందా. అక్కడే వుండు పో" అని తప్పకుండా అంటుంది. అననీ... కానీ ఏమీ అనకుండా... చీపురోమూల పెట్టి రెండు సందుల అవతల ఇడ్లీబండి దగ్గర్నించి నాలుగిడ్లీలు పొట్లం కట్టించుకుని ప్లాస్టిక్ గ్లాసులో టీ పోయించుకొచ్చి మాట్లాడకుండా అతనెదట నిలబడింది.

అల్లుడు హనుమంతుకి గవర్మెంటులో నాలుగోతరగతి ఉద్యోగం. ఆ వుద్యోగం ఏయించుకోడానికి తెచ్చిన అప్పు కట్నంగా ఇస్తేనే కూతుర్ని చేసుకుంటానన్నాడు అల్లుడి తండ్రి. అల్లుడి తల్లి తనకి సొయానా చెల్లెలే. అదేమీ అనకుండా నోరుమూసుక్కూసుంది. అందుకే అప్పుచేసి అడిగిన కట్నమిచ్చి కూతుర్నిచ్చాడు. ఆ అప్పు తన కాస్త ఇంటినీ మింగేసింది. ఇల్లుపోతేనేం? తన సొంత మేనల్లుడూ, తన కూతురూ తనని బాగా చూసుకోరా ఎట్టా?! అనుకున్నాడు. అల్లుడైన మేనల్లుడు బాగా కుదురుకున్నాడు. జీతమూ, గీతమూ అన్నీ బాగానే వున్నై. ఇల్లంతా నింపుకున్నాడు. పెళ్లానికి బంగారం తాడు చేయించాడు. దాని చేత పని మాన్పించాడు. అంత కట్నమిచ్చిన మామని, సొంత మేనమామని తన దగ్గర కొన్నాళ్ళైనా ఉంచుకోడా అని ఆశపడ్డాడు ఈ మనిషి. "నా కాడుండు నాన్నా" అని కబురుచేసింది కూతురు. వాళ్ళమ్మ పోయినాక అదే తనకి ఆధారమయింది. కూడుడకేసేది. తను బట్టలుతుకుతుంటే కాలవలో ఝాడించేది. ఆరేసేది. కానీ అదుత్త అమాయకురాలు. బొత్తిగా నోరులేనిది. దాని అత్తకి నోరుంది. కాని అది అవసరమైనప్పుడే తెరుస్తుంది. లేనప్పుడు నోరేలేనిదాన్లా వుండిపోతుంది. కూతురు నోరు మొగుడు ఎదుట అసలు పెగలదు. నాలుగు రోజులకే తరిమి కొట్టాడు హనుమంతు. తన తండ్రిని చూసుకోవడం తనకి న్యాయం కానీ మామని చూడక్కర్లేదన్నాడు. కొడుక్కాడికే పొమ్మని టికెట్ కొనిచ్చాడు.

"హనుమంతుకాడికి పోయొచ్చా... తరింకొట్టాడు... అయితే దుర్గమ్మ. లేపోతే కిష్టమ్మ అనుకుంటూ దిగబడ్డా" అన్నాడు ఆ వచ్చిన మనిషి.

"అదేంది నాన్నా వస్తే వచ్చావులే. నేన్నీ కొడుకుని కానా? మద్దిలో దుర్గమ్మేంది?" అన్నాడు పానకాలు ముద్దముద్దగా... అతనికింకా కళ్ళు తెరిపిన పడ్డం లేదు.

"అవునయ్యా! ఇప్పుడు నా అసుమంటి ముసలాళ్ల బతుకులు ఆడాళ్లమీనే ఆధారపడుండయ్. నా కూతురికి కాస్త నోరుంటే నన్ను రానిచ్చేదా? పదినోళ్లతో ఇరుసుకు పడే ఈ దుర్గమ్మ ఉండనిత్తేనే కదా నేనీడుండేది? అదేనయ్యా, నీ తాగుడేమో, పనేమో

ఇంకేం పట్టుద్ది నీకు? ఆడాళ్ల నోరు మీద, అళ్ల కట్టం మీనా మన బతుకులు" అన్నాడు తండ్రి.

తల దువ్వుకుని చీర కుచ్చెళ్లు సరిచేసుకుని వచ్చిన దుర్గ "నేను నాలుగు ఫ్లాట్లల్లో బట్టలు గుంజాలి. మావయ్యా!! నువ్వు అట్టా కాస్త నీడొచ్చే కాడ మడత మంచం వాల్చుకుని పడుకో. నేనొచ్చే పాలికి ఒంటిగంట దాటుద్ది. ఇడ్లీ తిన్నావ్‌గా... వచ్చి అణ్ణం పెడతాలే" అని చెప్పి పానకాలుని ఇకనైనా బయటికొచ్చి కూచోమని అరిచి లిఫ్టెక్కి పోయింది.

"చెప్పు ఏంటి సంగతి?" అన్నాడు పానకాలు.

"ఇంకా బతికే వుండా..." అని శోషకొచ్చిన వాడి మాదిరి మంచంలో పడి కళ్ళు మూసుకున్నాడు తండ్రి.

బట్టలుతుకుతున్న దుర్గకి అమ్మగార్లు చెప్పేవేవీ వినపడ్డం లేదు. మురికి పట్టిన ఎముకల గూడే కళ్ళముందు కదుల్తోంది. జానా బెత్తెడు గదిలో నలుగురు మనుషులు... అరజానా అరబెత్తెడు బాత్‌రూమ్... వాచ్‌మన్ కుటుంబానికీ, డ్రయివర్లకీ అపార్ట్‌మెంట్‌లో పనివాళ్లకీ... వచ్చేది చలికాలం. ఎక్కడ పడుకుంటాడు? ఒంటిగంట అయేపాలికి ముసలాడి గొంతు ఆరిపోద్దో ఏమో! మద్దెలో వెళ్లి సూసిరావాలి. ఈ పానకాలు సచ్చినాడు ఇయ్యాలైనా బండేశాడో లేదో? మూడు రోజుల్నించీ చటర్జీబాబుగారి మేడంగారి జరీ చీరెలు ఆమైనే అట్టిపెట్టాడు. అనూష్కమ్మగారి డ్రెస్సులివ్వకపోతే ఆయమ్మ కాళికమ్మ అవుద్ది. ఆశకొద్దీ తను ఉతికిన బట్టలన్నీ మూటగట్టుకొచ్చింది. సందు చివర బండాయనకి ఇచ్చి దుద్దించినా పోయేది. ఏందో ఇట్టా తయారయాడు ఈ మద్దిన. అనుకుంటుండగానే ఆమెకు గబగబా మరో పది చేతులు మొలుచుకొచ్చాయి. రోజూ నాలుగు గంటలు పట్టే ఉతుకుడు రెండు గంటల్లో పూర్తి చేసి కిందకొచ్చిపడి... పానకాలు ఇస్త్రీ చేస్తుండగా చూసి కాస్త శాంతించి వీధి మొగదల్లో వున్న కర్రీ పాయింట్‌లో సాంబారు పోయించుకొచ్చి ముసలాయన్ని లేపి అన్నం పెట్టింది.

"ఇదిగో, నీకు ఊర్కే తాగటం... లేకపోతే పెట్టె రుద్దడం తెలుసు... బతుకు తెలివి లేదు. అమ్మాజీ మేడంగారి పనిపిల్ల వూరెళ్లిందంట... నన్ను సతాయిస్తోంది పని చేసిపెట్టమని... ఆమెగాని ఫోన్ చేస్తే నేను లెగలేదని చెప్పు" అంది పది నోళ్లనీ ఒకటిగా చేసి.

ప్రవాస భారత సంతాన సౌభాగ్య సూచికలా ఉండే అమ్మాజీగారంటే పానకాలుకి కూడా భయమే. ఎడతెరపిలేకుండా మోగుతున్న ఇంటర్కాం ఎత్తి అప్పుడే పుట్టుకొచ్చిన బతుకు తెలివితేటల్లో "దుర్గకి పేణం బాగాలేదండి. పడుకుంది. లెగలేదు..." అని అప్పజెప్పాడు.

సాయంత్రం దాకా అదేమైన నిద్రపోయిన ముసలాయనకి సాయంత్రం బాగా మెలుకువొచ్చి చూస్తే... పానకాలు ఇస్త్రీ చేసుకుంటున్నాడు. ఒక పక్క రుద్దిన బట్టల రాశి ఉంది. మనిషి అలసిపోయి వున్నాడు. దుర్గ అపార్ట్‌మెంట్ కారిడార్లలో లైట్లేసి వచ్చింది. ట్యాంకులో నిండా నీళ్లున్నయ్యో లేవో చూసొచ్చింది. కూతురికి తలదువ్వి జడలేస్తూ "ఇంక ఈ పేలతో నా వల్ల కాదుగానీ అనుష్కమ్మ లాగా క్రాపు కొట్టించేసుకో" అని కూతురికొక మొట్టికాయ వేసింది.

"మీ నాన్న నీతోనే ఉంటానికొచ్చాడా ఎట్టా?" అని అప్పుడే దిగొచ్చిన చటర్జీగారు అంటూండగానే పానకాలేం  తెలివితక్కువ మాటంటాడోనని గబిక్కిన "లేదు సార్. సూసి పోదామనొచ్చాడు. శానా రోజులైంది పిల్లల్ని చూసి" అంది దుర్గ.

"పాపం బాగా పెద్దాడైపోయినట్టున్నాడు" సానుభూతిగా అని కారెక్కి పోయాడాయన.

"ఈన మనూరి మునసుపుగారి పెద్ద కొడుకంట. మనూరి పేరు సెబితే, సర్లే అని వాచ్‌మన్ పనిచ్చాడు" అని తండ్రితో చెప్పాడు పానకాలు.

"నా సిన్నప్పుడు మునసుపుకి ఒక కొడుకుండేవాడు. ఈయనే కావచ్చు... సొతంత్రానికి పదేళ్ల ముందే పుట్టాడంట... నేనేమో గాంధీగార్ని కాల్చి చంపినరోజే పుట్టానంట..." అన్నాడు తండ్రి.

"మరయితే నిన్ను పెద్దాడయిపోయాడంటాడేందీ? అదేం కాదు... నువ్వే ముసలాడివి. నీ చేతులు  సూడు  ముడతలు ముడతలు... జుత్తు సూడు నారపీసు. నీ పళ్లు సూడు ఆయన పళ్లు సూడు" అంది పానకాలు కూతురు కిచకిచలాడుతూ.

"నువ్వు నోర్మూయ్... పోయి సదువుకో..." అని నవ్వుకుంటూ కూతుర్ని ఉట్టుట్టిగా గదిమింది దుర్గ. తనని హైదరాబాద్ నించీ ఎందుకొచ్చావని తిడుతుందనుకున్నాడు. ఇప్పటిదాకా తిట్టలేదు. రాగానే తిండి పెట్టింది. ఇస్త్రీ చేసిన బట్టలన్నీ పట్టుకుపోయి డబ్బులు వసూలు చేసుకొచ్చింది. అందులో వాటాల కోసం కాసేపు కీచులాడుకున్నాక వాడి చేతిలో కొంత పెట్టింది. పానకాలు బాగా తిట్టాడు. పొద్దున కాణ్ణించి రెక్కలు గుంజేలాగా తను ఇస్త్రీ చేస్తే డబ్బులు లాక్కుంటావా అని ముద్దుగా రెండు బూతులుకూడా ప్రయోగించాడు. పొద్దున పదిగంటల దాకా పదినోళ్లూ, పదిచేతుల్తో వుండే దుర్గ మధ్యాహ్నం పూట తొమ్మిదినోళ్ళకి విశ్రాంతి ఇచ్చి ఒక్క నోరు మాత్రమే వాడుతుంది. పానకాలు బూతులు తిడితే పదినోళ్ల శక్తీ ఆ ఒక్క నోటికి వస్తుంది. అతను సణుక్కుంటూ పోయి సారా తెచ్చుకుంటాడు. రాత్రి పదింటిదాకా కాంపౌండులో అటూ ఇటూ తిరుగుతూ వాచ్‌మన్ పాత్ర పోషిస్తాడు. తరువాత గదిలోకి మాయమైపోతాడు. దుర్గ తన వెయ్యికళ్ళనీ పది

చేతుల్నీ గేట్లు తాళాలేసేదాకా అప్రమత్తంగా వుంచుతుంది. ఎవరైనా ఫోన్ చేసి పానకాలు లేడా అంటే ఎవరో ఇప్పుడే బయటికి పంపారని అతన్ని కొంగుచాటున దాస్తుంది. చిట్టిపొట్టి పనులైతే తనో, కొడుకో చక్కబెడతారు.

"ఏంటీ? ముసలాడొచ్చి రెండు వారాలైంది. ఇక్కడే వుంటాడా ఏందీ? మాట్లాడుకునే టప్పుడు నువ్వూ నీ పిల్లలే నని చెప్పావు?" అని అడగనే అడిగాడు చటర్జీబాబు.

ఆ మాట తండ్రితో చెప్పి "అసలు ఇద్దరు మాత్రమే వుండే వాచ్‌మెన్ కోసం చూసుకున్నారంట. నమ్మకంగా వుండేవాళ్లు దొరక్కపోతే చటర్జీబాబుగారే పిల్లలుంటే మాన్లే రమ్మన్నారు" అన్నాడు కాసేపాగి.

"ఈ పీత బొక్కంత గదిలో ఇబ్బందిపడేది నువ్వా, వాళ్లా? పాపం పిల్లలు ఎప్పుడు సూసినా బయటే గందా వుండేది. రేత్రయ్యే పాలికి ఇదంతా కూడా కార్లు స్కూటర్లేనాయె. చోటేది?" అన్నాడు ముసలాయన. అప్పుడు దుర్గ గదిలో కూచుని వార్తలు చూడ్డంలో నిమగ్నమైవుంది. ఈ మధ్యన సీరియళ్ళకంటే వార్తలే చూడబుద్దౌతున్నయ్... సీరియళ్లలో ఒకటే సచ్చు దద్దమ్మ ఆడాళ్లు. లేదంటే ఇసప్పుచ్చెలు (విషపు పుచ్చెలు!)... ఒకే మైన సూత్రాలు కళ్లకద్దుకోటాలు. ముక్కెగబీల్చటాలూ... మా ఎగటు పుట్టించేతన్నయనుకోండమ్మా! ఎన్నెన్ని వార్తలో... ఎన్నెన్ని విచిత్రాలో గందా? పెపంచం కళ్ళముందే వున్నట్టుంటది...

ముసలాయన గమనిస్తున్నాడు. పానకాలు పేరుకే వాచ్‌మన్. అసలు వాచ్‌మన్ దుర్గే. అతన్ని పనిలోంచి తీసెయ్యకుండా అబద్ధాల మీద అబద్ధాలు చెప్పి కాపాడుకొస్తుంది... పానకాలు ఇస్త్రీ పని మాత్రం ఒళ్లు దాచుకోకుండా చేస్తాడు. పిల్లాడు పొద్దున్నే లేచి గేట్లో పడున్న పేపర్లు ఏరి ఎవరివి వాళ్లకిస్తాడు. తల్లి తెచ్చిన పాల పాకెట్లు పంచుతాడు. వాళ్లంతా అట్లా ఇరవై నాలుగు గంటలూ బతుకు పెనుగులాటలో వుండగా మద్దెలో తనొచ్చి పడ్డాడు. రెండు పూట్లా రెండు డబ్బాల బియ్యం ఖర్చే. ఆ వయసులో తనకో సొంత కొంప వుండేది. వుతుక్కోడానికి వాడుక ఇళ్లు. సంవత్సరానికిన్ని తిండి గింజలు. పెళ్ళిళ్లకీ, పేరంటాలకీ మామూళ్ళు... పైన ఇస్త్రీ కొట్టు... అన్నీ పోయినయ్... వూరే మాయమైపోయింది. కొడుకుకి రెక్కలు తప్ప ఏమీ ఇవ్వలేదు తను. ఎంత బెమలో పడ్డాడు? దుర్గ నోరు చూసి దడుసుకుని ఉన్నదంతా ఊడ్చి అల్లుడెదాన పోశాడు. ఆ సచ్చినాడేమో పట్టుమని పదిరోజులుండనిచ్చాడా? గెహచారం కాపోతే... ఇక్కడ ఒక్కొక్కళ్లకీ రెండేసి కార్లు... చదువుకునే పిల్లలకి స్కూటర్లు. రేత్రయిందంటే ఆవరణలో మసిలే జాగా వుండదు. ఎంతసేపూ బయట కూచోవాలే గానీ గదిలో కాలుపెట్టే చోటుండదు. దుర్గ ఎన్నాళ్లు ఊరుకుంటుంది? అది నోరు తెరిస్తే ఇకంతే... బతికితే చటర్జీలాగ బతకాలి. పదిళ్లు... వంద స్తలాలు, కట్టలు కట్టలు డబ్బు... ఆయమ్మ ఒళ్ళంతా వజ్రాలే... అమృతం తాగుతున్న మనుషులు.

బెంజ్ సర్కిల్ దగ్గర కొత్తగా కట్టిన మాల్‌దాకా సైకిల్ తొక్కుకుపోయి తాజా తాజా యాపిల్ పళ్లు తెచ్చినప్పుడు "మీ నాన్న వుండడం ఇక్కడెవరికీ ఇష్టంగా లేదు పానకాలూ... ఆయన్ని మీ వూరు పంపెయ్... కావాల్నంటే నెలకి పదో పరకో పంపు. నీకు జీతంగాక... ఇంటద్దె ఫ్రీ... కరంటు ఫ్రీ... కేబుల్ ఫ్రీ... పైన పాలు తెచ్చినందుకు డబ్బులు... ఏదైనా పని చేసిపెడితే డబ్బులు... ఇస్త్రీ డబ్బులు... మీ ఆవిడ నాలుగిళ్లల్లో బట్టలుతికిన డబ్బులు.. నీకేమిటి?" అని పానకాలుకి ఆస్తిని మించిన ఆదాయపు లెక్కలు అందజేసింది చటర్జీ మేడమ్. ఆ సంగతి ఆ రాత్రి తండ్రి చెవిలో వేశాడు పానకాలు.

"అయితే ఎళ్ళిపొమ్మంటారా?" అన్నాడు ముసలాయన.

"ఆయమ్మ సెప్పినట్టు..." అని బుర్ర గోక్కున్నాడు పానకాలు.

"ఏ యమ్మ చెప్పిందీ?" అంది టీవీ కట్టేసి బయటకి వచ్చిన దుర్గ. చటర్జీ మేడమ్ చెప్పిందంతా పూసగుచ్చాడు పానకాలు.

"ఓహో పానకాలు సామీ... ఇహ పాలపాకెట్ల మీదొచ్చే ఏలు లచ్చలు, ఇస్త్రీ మీదొచ్చే కోట్లూ స్విస్సు బాంకులో దాస్తాడు కామోసు. మామయ్యా దిగులు పడమాక... నీక్కూడా రెండు మూడు కోట్లు పంపిత్తాల్లే" అని కిసుక్కున నవ్వింది. టీవీ వార్తలు చూసి చూసి తెలివి మీరిపోయిందనుకున్నాడు పానకాలు.

పానకాలుకి కూడా తనుంటం నచ్చట్లేదల్లే వుంది. దుర్గ శానా గడుసుది. ఆవిడ అంత తొరగా బయటపడదు. అయినా దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వనట్టు మయాన ఈ చటర్జీగాడు తగులుకున్నాడు కదా... ఛీ కొట్టే దాకా వుండమంటావా కిష్టమ్మ తల్లీ అనుకున్నాడు. అదిగో అట్లా అనుకున్న రోజు అర్ధరాత్రి నెమ్మదిగా గేటు తాళం తీసి ఒకడుగు ముందుకేశాడు.

అప్పుడు గేటు చప్పుడికి ఉలిక్కిపడి లేచింది దుర్గ.

* * *

"అసలు ఆ మడిసి ఎల్లిపొమ్మంటే నువ్వు ఎల్లిపోడమేనా... ఆయన కిష్టలో దూకమంటే దూకేస్తావా?" ముసలాయన్ని గేటులోనుంచి లోపలికి ఒక్క గుంజు గుంజి గట్టిగా అరిచింది.

అదుగో అప్పుడే నేను స్కూటర్ స్టాండ్ వేశాను.

"ఏమైంది దుర్గా?" అన్నాను కాస్త నిరాసక్తంగానే. నా కూతుర్ని ఒక్కదాన్నే వదిలేసి వెళ్లాను కదా. అదెలా వుందోనని తల్లి ప్రాణం గుర్తొచ్చింది అప్పుడే. అది హాయిగా నేను లేని సందర్భాన్ని బాగా ఆస్వాదించి వుంటుంది అనుకుంటే నవ్వొచ్చింది.

దుర్గ చెప్పింది. మావయ్య దుర్గమ్మని కాక కిష్టమ్మనే ఎంచుకున్నాడని. ముసలాయన కన్నీళ్లు కారుస్తుంటే దుర్గ మాత్రం చాలా కోపంగా వుంది.

"మీరు సెప్పండమ్మా! అట్టా సెయ్యొచ్చా? మేం లేమా? ఆయన వుండద్దంటే గంగిరెద్దల్లే తలూపొచ్చాడంట ఈనగారి కొడుకు. ఈనేమో సావడానికి రడీ అయిపోయాడు. మద్దెలో నేనున్నా ఒకటే లేకపోయినా ఒకటే అని గదా? నువ్వూర్కో మావయ్యా... నిన్నెట్టా పొమ్మంటాడో నేజూసుకుంటాగా..." అని గేటు మూసి తాళం వేసింది కోపంగా ఎర్రబడ్డ మొహంతో.

"మొన్నటిదాకా నా నోరు పెద్దదని అనేవాడివిగా! నోరు లేకపోవడం గూడా మంచిదిగాదుగా... పెద్ద ఉద్యోగత్తుడికిచ్చి దానికున్న సేతులు గూడా నువ్వే ఇరగదీసి పెట్టావు. లేకపోతే నాకు మల్లే నాలుగిళ్లల్లో పనిచేసి నాలుగు రూపాయలు తెచ్చుకుంటే మొగుడికి సెప్పో సెప్పకో నీకు సాయితాగా వుండేది... పోన్లే ఇప్పుడేమైందంటా... నువ్వేం అంత మూడుకాళ్ల ముసలాడివి కావు. కడుపునిండా తింటే సత్తవొస్తాది. ఏవో సిన్న సిన్న పన్లు సేసుకోలేకపోవు. పోయి పడుకో పో..." అంది.

అతను ఎక్కడ పడుకుంటాడని అడిగాను. ఆవరణంతా కార్లతో స్కూటర్లతో నిండిపోయింది.

"ఇస్త్రీ బండిలో ముడుసుకు పడుకుంటున్నాడు. మా గది ముంగల రెండు మడత మంచాల మీన పానకాలూ పిల్లాడూ, గదిలో నేనూ పిల్లా..." అంది.

"అయ్యో! పోనీ వచ్చి మా బాల్కనీలో పడుకోమను" అన్నాను.

"సార్ వూర్నుండొచ్చి కోపం పడతారేమో లేమ్మా? ఎందుకొచ్చింది వద్దులెండి" అంది.

"నేను పడుకోమంటే ఆయనెందుకు వద్దంటాడు? అనదు..."

"ఒద్దులేమ్మా... ఆనక తంటాలొత్తాయి..." అంది ఏ మాత్రం తొణక్కుండా.

"ఏం రావులే... నువ్వు పదవయ్యా..." అని ముసలాయన్ని తోడ్కొని పోయాను.

"ఏం చేసినా ఆడాళ్ళే సెయ్యాలమ్మా... నా కొడుకు సూసావా బయటింత గొడవైనా లోపల్నించి రాలేదు. ఇంకాసేపటి ముందే తాగుడాపి పడుకున్నాడు... అదు కట్టపడతాదు. తాగుతాదు. ఇంకేం పట్టదు. నా మీన పేముంది ఆడికి. దీన్నోటికే దడిసి వుండు నాన్నా అనదు... ఏమన్నా అదే అనాలి" అన్నాడు ముసలాయన.

ఇప్పుడు మళ్లీ ఆశ్చర్యమేసింది నాకు. ఈ ముసలాయనకి యెండి గట్టి పడ్డ బాదం పెంకు కనిపిస్తోంది. కానీ దాన్ని కొట్టి లోపలి పప్పు చూసే ఓపిక లేదు. బహుశా అతని దృష్టి కూడా ఎండి ఎండి పెంకు కట్టి పోయుంటుంది.

అతను పడుకుని ఆకాశం కేసి చూస్తూ రెండు చేతులూ జోడించాడు. బహుశా "కిష్ణమ్మా ఇప్పుడు కాదులేమ్మా ఇంకోపాలి సూసుకుందాం" అనుకుంటున్నాడేమో! *

*(ఆదివారం ఆంధ్రజ్యోతి – మే 2011)*